అర్హులందరికీ రేషన్‌ కార్డులు: కలెక్టర్‌

సాక్షి, సిటీబ్యూరో: అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్‌ కార్డులు అందిస్తామని జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. గ్రామ సభల్లోనూ దరఖాస్తు తీసుకుంటామని వివరించారు. గ్రామ, వార్డుల్లో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించినా వాటిని పరిశీలించి అర్హులకు రేషన్‌ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. కుటుంబంలో విభజన అయినవారు, కొత్త కార్డు కావాలని తీసుకున్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి దరఖాస్తులు అందజేయని వారు సైతం గ్రామ, వార్డు సభల్లో వచ్చే అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

21 నుంచి గ్రామ సభలు

శామీర్‌పేట్‌: ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 21 నుంచి 24 వరకు పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు శామీర్‌పేట్‌ ఎంపీడీఓ మమతా బాయి తెలిపారు. మండలంలోని గ్రామాలలో గ్రామ సభలు, తూంకుంట మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో వార్డు సభలు నిర్వహించనున్నారు. ఈ నెల 21న మండలంలోని అలియాబాద్‌, మున్సిపాలిటీ పరిధిలోని బాబాగూడ, బొమ్మరాశిపేట్‌లలో, 22న పొన్నాల, లాల్‌గడిమలక్‌పేట్‌, 23న తుర్కపల్లి, మురహరిపల్లి, యాడారం, శామీర్‌పేట్‌, మజీద్‌పూర్‌ గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లలకు గాను సభలో లబ్ధిదారుల గుర్తింపు, ఎంపికపై చర్చించనున్నట్లు తెలిపారు.

బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యం

పోచారం: బీజేపీ పార్టీని బలోపేయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని బీజేపీ ఘట్‌కేసర్‌ మండల అధ్యక్షుడు బస్వ రాజు గౌడ్‌ స్పష్టం చేశారు. కాచవానిసింగారం గ్రామానికి చెందిన రాజు నూతనంగా అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మేడ్చల్‌ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థినే ఎమ్మెల్యేగా గెలిపించుకునే విధంగా కృషి చేస్తానన్నారు.

అభినందనలు

జవహర్‌నగర్‌: కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియన్‌ మ్యాథమెటికల్‌ సొసైటీ (ఐఎంఎస్‌) సభ్యుడిగా హైదరాబాద్‌ బిట్స్‌ ఫిలానీ క్యాంపస్‌ గణితశాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్‌ ప్రద్యుమ్న కుమార్‌ సాహూ ఎన్నికైనట్లు సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎంఎం.షికారే శనివారం ఓ ప్రకటనలో ప్రకటించారు. 2028 మార్చి 31 వరకు సాహు ఈ పదవిలో కొనసాగుతారని, సొసైటీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియన్‌ మ్యాథమెటికల్‌ సొసైటీ సభ్యుడిగా ఎన్నికైన సాహును బిట్స్‌ ఫిలానీ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడి మృతి

ఘట్‌కేసర్‌: ఏదులాబాద్‌ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు గూడెం ఆంజనేయులు ముదిరాజ్‌ శనివారం గుండెపోటుతో మరణించారు. అర్ధరాత్రి తర్వాత గుండె నొప్పి రాగా..కుటుంబ సభ్యులు సీపీఆర్‌ చేసినా ఫలితం లేకపోవడంతో వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. గ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఇతర నాయకులు ఆంజనేయులు మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు.

తల్లి మందలించిందని కూతురి ఆత్మహత్య

పోచారం: తల్లి మందలించినందుకు కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం ఐటీ కారిడార్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడలోని వెంకటాద్రి టౌన్‌షిప్‌లో ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన డోలు కోటయ్య మేస్త్రి పని చేసుకుంటూ తన భార్య సుజాత, ఇద్దరు కొడుకులు అద్భుత్‌ కుమార్‌, లక్కీ, కూతురు కావ్యతో నివసిస్తున్నాడు. ఇతని కూతురు (15) 7వ తరగతి వరకు చదువుకుని తర్వాత టైలరింగ్‌ నేర్చుకుని ఇంట్లోనే ఉంటోంది. శుక్రవారం కుట్టు మిషనులో సూదిని విరగొట్టినందుకు కూతురిను తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లో ఎవరూలేని సమయంలో శనివారం ఉదయం పదిన్నర గంటలకు బెడ్‌రూమ్‌లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పక్క వారు గమనించి పనికి వెళ్లిన తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. బాలికను చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే బాలిక చనిపోయినట్లు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘సర్వే’త్రా..సందడి!

- సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికపై కొనసాగుతున్న సర్వే
- రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికే కీలకం
- కొత్త నిబంధనలతో సర్వత్రా చర్చనీయాంశంగా మారిన వైనం..
- గ్రామ/వార్డు సభల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక



సాక్షి,సిటీబ్యూరో: సంక్రాంతి సందడి ముగిసింది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాల్లో కొత్త సంక్షేమ పథకాల సందడి మొదలైంది. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్‌ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల అమలును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. దీంతో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను గత గురువారం నుంచి మొదలుపెట్టారు. రెండు, మూడు రోజులుగా పురపాలక సంఘాలు, గ్రామాల్లో ప్రత్యేక బృందాల పరిశీలన, హడావుడి కనిపిస్తోంది. ఈ నెల 20 వరకు నాలుగు పథకాల ఆశావహుల వివరాల పరిశీలన కొనసాగనుంది. ఆ తర్వాత 21 నుంచి 24 వరకు గ్రామ/వార్డు సభల్లో అభ్యంతరాలను పరిశీలించి లబ్ధిదారుల జాబితా రూపొందించనున్నారు. ఈ మేరకు గ్రామ/వార్డు సభల నిర్వహణపై జిల్లా అధికార యంత్రాంగం పక్కాగా కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయటం ద్వారా ముందుకు సాగుతోంది.

శాఖల వారీగా బాధ్యతలు..

లబ్ధిదారుల గుర్తింపులో ముఖ్య బాధ్యతలను స్థానిక తహసీల్దార్లు, మండలాభివృద్ధి అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. వీరి పర్యవేక్షణలో మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తదితర సిబ్బందితో కూడిన బృందాలు సర్వే చేపడుతున్నాయి. ఏవోలు, ఏఈవోలు..రైతు భరోసా, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు.. రేషన్‌ కార్డులు, ఉపాధి హామీ అధికారులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే తుది దశకు చేరుకోవటంతో సంబంధిత కమిటీలు త్వరలో గ్రామ/వార్డు సభలు నిర్వహిస్తాయి.

పెట్టుబడి సాయానికి ‘సాగు యోగ్యత’

‘రైతుబంధు’ తరహాలో కాకుండా కేవలం సాగు భూములకు ఏడాదికి ప్రస్తుతం రూ.12 వేల పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వ నిర్ణయింది. ఈ నేపథ్యంలో వ్యవసాయేతర, సాగు యోగ్యం కాని భూముల వివరాలను ఏఈవోలు గ్రామాల వారీగా పకడ్బందీగా పరిశీలిస్తున్నారు. వివరాల్లో తప్పులుంటే చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించిన నేపథ్యంలో పారదర్శక పరిశీలన కొనసాగుతోంది.

సాగు చేయని భూములకు రైతు భరోసా కట్‌

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 40,960 మంది రైతులకు సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, ఇందులో ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో 35 వేల ఎకరాలు, యాసంగిలో దాదాపు 24 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 50 శాతం భూముల్లో పంట సాగు కావటం లేదు. కాంగ్రెస్‌ ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఈ సాగులో లేని 50 శాతం భూములకు భరోసా దక్కదని భావిస్తున్నారు.

‘ఇందిరమ్మ కమిటీ’లే కీలకం

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయటానికి కసరత్తు మొదలైంది. తొలి విడత ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 17,500 ఇళ్లు మంజూరు చేయనున్నారు. దరఖాస్తుల సర్వే, తుది పరిశీలన (సూపర్‌ చెక్‌) ఇప్పటికే పూర్తవగా, తాజాగా గ్రామ, వార్డు సభల్లో ఇందిరమ్మ కమిటీల ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

భూమిలేని వారికే ఆత్మీయ భరోసా

భూమిలేని నిరుపేద కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల సాయాన్ని (రెండు విడతలుగా) ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. గతేడాది ఉపాధి హామీ పథకంలో కనీసం 20 పనిదినాలు చేసిన వారిని అర్హులుగా గుర్తిస్తున్నారు. భూమి లేని దరఖాస్తుదారుల వివరాలను ఉపాధి హామీ సిబ్బంది సేకరిస్తున్నారు. జిల్లాలో 18,014 జాబ్‌ కార్డులు ఉండగా, ఇందులో 19,387 మంది కూలీలు ఉన్నారు.

నిరీక్షణకు తెరపడేలా..

గతేడాది ప్రజా పాలనలో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. కులగణన సర్వే ఆధారంగా రేషన్‌ కార్డుల ఎంపికపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కొత్త రేషన్‌ కార్డుల కోసం వివిధ మార్గాల్లో 1.89 లక్షల దరఖాస్తులు అందినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. వీరిలో ఎంత మందికి కార్డులు దక్కుతాయో చూడాల్సి ఉంది.

పేదల ఇళ్లను కూల్చితే సహించం: ఎంపీ ఈటల



అరుంధతినగర్‌లో కూల్చివేతలను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని అరుంధతినగర్‌లో శనివారం రెవెన్యూ, హుడా అధికారులు అక్రమ నిర్మాణాలంటూ ఇళ్లను కూల్చివేశారు. ఈ విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అరుంధతినగర్‌లో పర్యటించారు. అక్రమంగా పేదల ఇళ్లను కూల్చితే సహించబోమన్నారు. ప్రభుత్వ పథకం కింద పేదలకు ఇళ్ల పట్టాలను అందచేయగా..వారు ఇందిరా ఆవాస్‌ యోజన పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకున్నారని, వాటిని ఇప్పుడు అకారణంగా కూల్చివేయడం దారుణమని ఆయన ఆరోపించారు. ఫిర్యాదుల పేరుతో పేదల ఇళ్లను కూల్చుతున్న రెవెన్యూ యంత్రాంగంపై సంబంధిత మంత్రికి ఫిర్యాదు చేస్తానని ఈటల హెచ్చరించారు. జవహర్‌నగర్‌లోని పేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకోబోమని, ప్రభుత్వంపై పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్‌ రూరల్‌ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌ యాదవ్‌, మేడ్చల్‌ రూరల్‌ ఓబీసీ మోర్చా అధ్యక్షులు మహేందర్‌యాదవ్‌, కార్పొరేటర్‌ పానుగంటి బాబు, రంగుల శంకర్‌, జవహర్‌నగర్‌ బీజేపీ అధ్యక్షులు కమల్‌, సంతోష్‌, సందీప్‌, యాదగిరి, అరుంధతినగర్‌ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడ్డ వారికి గుర్తింపు



మాజీ అధ్యక్షుడు హనుమాన్‌ను సత్కరిస్తున్న బీజేపీ రూరల్‌ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేసిన వారికి బీజేపీ గుర్తిస్తుందని బీజేపీ రూరల్‌ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బంధన్‌ ఫంక్షన్‌ హాల్‌లో జరిగిన మున్సిపల్‌ బీజేపీ మాజీ అధ్యక్షుడు హనుమాన్‌ వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి మెమోంటో అందజేశారు. అలాగే బీజేపీ మున్సిపల్‌ నూతన అధ్యక్షుడిగా ఎన్నికై నా మహిపాల్‌రెడ్డిని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ కావేరి సత్కరించారు. కార్యక్రమంలో రాధిక, ఆంజనేయులుగౌడ్‌, రామోజీ, మధు, శ్రీరాములు, మహిపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, రామతీర్థ, మశ్చేందర్‌రెడ్డి, సిద్దిరాజ్‌, రవిశంకర్‌, సంపత్‌రెడ్డి, నరేష్‌ముదిరాజ్‌, చందు, రవీందర్‌రెడ్డి, పవన్‌, బిక్కునాయక్‌, రోహిత్‌సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ మెడికల్‌ కళాశాలలో ‘ట్రెడిషనల్‌ డే’



వేడుకల్లో కళాశాల చైర్మన్‌, అధ్యాపకులు తదితరులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ మెడికల్‌ కళాశాలలో శనివారం ట్రెడిషనల్‌ డే మరియు ఫ్రెషర్స్‌ డే వేడుకలు నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని పండగలు, వాటి ప్రత్యేకతలను తెలిపేలా విద్యార్థులు స్టాల్స్‌ ఏర్పాటు చేసి ప్రదర్శనలు ఇచ్చారు. ఫ్రెషర్స్‌డేలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పలు పోటీల్లో పాల్గొన్నారు. వేడుకల్లో జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌ స్వామి, కళాశాల చైర్మన్‌ గోపాల్‌రెడ్డి పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో సెక్రటరీ వసంతలత, సీఈఓ అభినవ్‌రెడ్డి, ఐశ్వర్య, డీన్‌ వెంకట రమణయ్య, డైరెక్టర్‌ అలీభేగ్‌, సూపరింటెంట్‌ బీఎస్‌ రెడ్డి, మేనేజర్‌ దుర్గాప్రసాద్‌రెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ మురళీకృష్ణ, ఏవో పూర్ణచందర్‌ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులను కలిసిన బీజేపీ నాయకులు



మేడ్చల్‌రూరల్‌: మేడ్చల్‌ బీజేపీ నాయకులు శనివారం పలువురు అధికారులను కలిశారు. మేడ్చల్‌ మున్సిపల్‌ బీజేపీ అధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నికైన మాజీ జెడ్పీటీసీ జల్లి శైలజ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మేడ్చల్‌ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్‌ శైలజ, మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణను కలిశారు. అధికారులు సమస్యలపై స్పందించాలని, బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా కార్యక్రమాలకు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్‌ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌, బీజేవైఎం అధ్యక్షులు వంశీ, బీజేవైఎం రాష్ట్ర నాయకులు అర్జున్‌, నాయకులు సర్వేశ్వర్‌రెడ్డి, అవినాష్‌చారి, వంశీరెడ్డి, నర్సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ జిల్లా జీఎస్‌గా సునీత



కీసర: మహిళా కాంగ్రెస్‌ మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా దమ్మాయిగూడకు చెందిన మెరుగు సునీత నియమితులయ్యారు. సునీత గతంలో రెండు పర్యాయములు జిల్లా కార్యదర్శిగా పని చేశారు. మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ చేతులమీదుగా శనివారం నియామకపత్రాన్ని సునీత అందుకున్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో పదవీ బాధ్యతలు అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌ కుమార్‌గౌడ్‌, మహిళా కాంగ్రెస్‌ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని వినతి



కీసర: కీసరలోని సర్వే నెంబర్‌ 362లో ఉన్న 1500 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ తహసీల్దారు అశోక్‌కుమార్‌కు శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ కమిటీ అధ్యక్షుడు తుడుం యాదగిరి శనివారం వినతిపత్రం అందజేశారు. పైన పేర్కొన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, వీరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడి ప్రజా అవసరాల కోసం వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దారు స్పందిస్తూ.. స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారును కలిసిన వారిలో కమిటీ ఉపాధ్యక్షుడు శీలం శ్రీనివాస్‌, కోశాధికారి బాల్‌రాజ్‌, గ్రామస్తులు ఉన్నారు.

డ్రైవర్‌ చాకచక్యంతో త్రుటిలో తప్పిన ప్రమాదం



కీసర: జవహర్‌నగర్‌ చెత్త డంపింగ్‌ యార్డుకు చెత్తను తరలిస్తున్న లారీకి షాట్‌సర్క్యూట్‌ కారణంగా అకస్మాత్తుగా మంటలు చెలరేగిన ఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అహ్మద్‌గూడ – హరిదాస్‌పల్లి రహదారిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జీహెచ్‌ఎంసీ పరిధిలో చెత్తను తీసుకొని జవహర్‌నగర్‌కు వెళ్తున్న టీఎస్‌ 08యుహెచ్‌ 7936 చెత్తలారీ అహ్మద్‌గూడ రహదారిలోని సాయిబాబా ఆలయ సమీపంలోకి రాగానే లారీలో షాట్‌ సర్క్యూట్‌ కారణంగా ఒక్కసారిగా లారీ ముందు భాగంలోని ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదాన్ని గమనించిన లారీ డ్రైవర్‌ సతీష్‌ చాకచక్యంతో లారీని పక్కకు నిలిపి ప్రాణాపాయాన్ని తప్పించుకున్నారు. విషయం తెలుసుకున్న ఫైర్‌ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కానీ అప్పటికే చెత్తలారీ పూర్తిగా దగ్ధమైపోయింది. సమాచారం అందుకున్న సీ.ఐ వెంకటయ్య లారీడ్రైవర్‌ చాకచక్యంగా వ్యవహరించిన తీరును అభినందించారు.

జాతరకు ముస్తాబైన గట్టుమైసమ్మ ఆలయం

- అమ్మవారిని దర్శించుకోనున్న వేలాది మంది భక్తులు
- ఆలయ పరిసరాల్లో గట్టి బందోబస్తు





జాతరకు ముస్తాబైన శ్రీ గట్టుమైసమ్మ ఆలయం

ఘట్‌కేసర్‌: శ్రీ గట్టుమైసమ్మ అమ్మవారి జాతరకు ఆలయం ముస్తాబైయింది.ఆదివారం జరుగనున్న జాతరకు మున్సిపల్‌ ప్రజాప్రతినిధులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, పోలీసులు, ట్రాఫిక్‌ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌ లైట్లతో అలంకరించారు. లైన్‌లో వెళ్లే భక్తుల కోసం చలువ పందిళ్లు వేశారు. బైపాస్‌ రోడ్డులో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించడానికి భారీకేడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏసీపీ చక్రపాణి 150 మంది పోలీసులతో గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.

జాతర ప్రశాంతంగా జరుపుకోవాలి...



జాతరకు వచ్చే భక్తుల కోసం అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ఆలయ పరిసరాలను శుభ్రం చేయించి భారీకేడ్లు ఏర్పాటు చేశాం. జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా చూసుకునేలా మున్సిపల్‌ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

–పావనీజంగయ్యయాదవ్‌, ఘట్‌కేసర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌

జాతరకు సహకరించండి..



దేవాదాయ శాఖ, పోలీస్‌, ట్రాఫిక్‌, మున్సిపల్‌ సిబ్బంది సహకారంతో ఆలయ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఏ మాత్రం అసౌకర్యం కలిగితే దేవాదాయ శాఖ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వండి.

– భాగ్యలక్ష్మి, ఈఓ గట్టుమైసమ్మ ఆలయం

కొన్ని ప్రాంతాలకే పరిమితమైన అభివృద్ధి

- బాగున్న రోడ్లకే నిధుల కేటాయింపు
- రోడ్ల కోసం కేటాయించని స్థలాల్లో రోడ్ల నిర్మాణం
- కొత్త కాలనీల్లో మౌలిక వసతుల కొరత
- నిధులు లేవంటూ కాలం గడిపేసిన పాలకవర్గం



పోచారం పురపాలక సంఘ కార్యాలయం

పోచారం: పోచారం మున్సిపాలిటీ పాలకవర్గం పదవీ కాలం ఈ నెల 26వ తేదీతో ముగియనుంది. ప్రథమ పాలకవర్గం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా అనేక కాలనీల్లో మౌలిక వసతులు లేవు. రహదారులు, తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు వంటి వసతులు లేని ప్రాంతాలే ఎక్కువగా ఉన్నాయి. వార్షిక బడ్జెట్‌ను దాదాపు రూ. 40 కోట్లతో రూపొందిస్తున్నప్పటికీ అభివృద్ధి మాత్రం ఫలించలేదు.

అభివృద్ధి ఆ ప్రాంతాలకు మాత్రమే...

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, పోచారం, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్‌, నారపల్లిలోని పాత గ్రామ ప్రాంతాలకే అభివృద్ధి పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆశించిన స్థాయిలో అభివృద్ధి పరంపర కొనసాగలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగానే ఇటీవల పోచారం మున్సిపాలిటీలో చౌదరిగూడ, కొర్రెముల, ప్రతాపసింగారం, కాచవానిసింగారం, వెంకటాపూర్‌ గ్రామాలను ప్రభుత్వం విలీనం చేసింది.

విలీన గ్రామాల్లో ఆరంభం కాని అభివృద్ధి పనులు

విలీన గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే మున్సిపల్‌ పాలక వర్గం గడువు ముగుస్తోంది. కేవలం పాలనా పరమైన కార్యకలాపాలకే పురపాలక సంఘం పరిమితమైంది. విలీన గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో పరిస్థితులు పాలన స్తంభించిందనడానికి నిలువెత్తు నిదర్శనాలుగా తయారయ్యాయి.

విస్తరిస్తున్న కాలనీల్లో మౌలిక వసతుల కొరత...

పోచారం మున్సిపాలిటీలో పలు కాలనీలు విస్తరిస్తున్నప్పటికీ మౌలిక వసతుల లేమితో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వసతుల కల్పన ‘ఎక్కడ వేసిన గొంగళి అక్కడే’ అన్న విధంగా ఉంది. పెరుగుతున్న జనాభాతో కొత్త కాలనీల నుంచి భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్‌ రెగ్యులరైజేషన్‌, రిజిస్ట్రేషన్లు, ఇంటి పన్నులు, ట్రేడ్‌ లైసెన్సుల ద్వారా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం వస్తున్నప్పటికీ ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టకపోవడం శోచనీయం. ఈ ప్రాంతాల నుంచి వచ్చే ఆదాయాన్ని ఇతర ప్రాంతాలకు ఖర్చుపెడుతూ పాత కాలనీలనే అభివృద్ధి చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

బాగున్న రోడ్లకే నిధుల కేటాయింపు..

రహదారులు బాగానే ఉన్నాయనుకున్న చోటే రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారని, కొన్ని ప్రాంతాల్లో రోడ్ల కోసం కేటాయించని స్థలాల్లోనూ రహదారులు వేశారని పలు కాలనీలకు చెందిన ప్రజలే పేర్కొంటున్నారు. మరమ్మతులతో బాగున్న రహదారులపై కొత్తగా రోడ్లు వేయడం విడ్డూరంగా ఉందన్న విమర్శలు ప్రరోక్షంగానే కాకుండా ప్రత్యక్షంగానూ వినిపిస్తున్నాయి.

నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్న పాలకవర్గం..

అభివృద్ధి పనులు చేపట్టాలని పలు కాలనీలకు చెందిన అసోసియేషన్లు, రాజకీయ పక్షాల ప్రతినిధులు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా నిధులు లేవంటూ పాలకవర్గం చేతులెత్తేస్తోంది. విస్తరిస్తున్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించడంలో పురపాలక సంఘం ఘోరంగా విఫలమవ్వడంతో జనం గేటెడ్‌ కమ్యూనిటీలవైపు చూస్తున్నారు. ఇండిపెండెంట్‌ ఇళ్లు కట్టుకుని ఇబ్బందులుపడే కంటే గేటెడ్‌ కమ్యూనిటీలో ఫ్లాట్‌ కొనుక్కుంటే బాగుంటుందనే నిర్ణయానికి వస్తున్నారు. పాలకుల తప్పిదాలతో ఒకచోట జరగాల్సిన అభివృద్ధి వేరొక చోటకు తరలిపోతోంది. నగరానికి పడమర వైపున ఉన్న అభివృద్ధి తూర్పు వైపున లేకపోవడానికి కారణం పాలకులు సరైన నిర్ణయాలు తీసుకోకపోవడమేనని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విధానపరమైన లోపాలే అభివృద్ధికి శాపంగా మారిందని భావిస్తున్నారు. ఇప్పటికైనా విస్తరిస్తున్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పురపాలక సంఘం విశేషంగా కృషి చేస్తూ, అభివృద్ధిని బాటలు వేయాలని పురప్రజలు కోరుతున్నారు.